సాక్షి
విజయనగరం
సోమవారం । 13 । జనవరి । 2025



మిలటరీ ఉద్యోగాలకు పుట్టినిల్లు ముగడ

మండలంలోని ముగడ గ్రామం మిలటరీ ఉద్యోగులకు పుట్టినిల్లుగా చెప్పకోవచ్చు.

- 10లో



ప్రత్యేక నిఘా

జిల్లాలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడిపందాలు, పేకాట, గుండాటలు, ఇతర రకాలైన జూద క్రీడలను నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

- 10లో

2 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్

రేగిడి: రెండు లక్షల మెట్రిక్ టన్నుల చెరకును క్రషింగ్ చేసినట్లు సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం ఏటీపీ పట్టాభిరామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉమ్మడి విజయనగరంతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని చెరకును సేకరించి క్రషింగ్ చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు సకాలంలో చెరకు నగదును చెల్లిస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దృష్టి సారించామని తెలిపారు.

న్యూస్‌రీల్

సుఖసంతోషాలు వెల్లివిరియాలి

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం రూరల్: సంక్రాంతి పండగ శుభవేళ జిల్లాలోని ప్రతీ ఇంట సుఖ సంతోషాలు వెల్లివిరియాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కార్యకర్తలకు, నాయకులకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో పంటలు చేతికి అంది పల్లెలు ధాన్య రాశులతో కళకళలాడాలని పేర్కొన్నారు. ప్రతీ ఇంట భోగి పండగ భోగభాగ్యాలను అందజేయాలన్నారు. పల్లెలన్నీ సంక్రాంతి శోభతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్



విజయనగరం అర్బన్: తెలుగు ప్రజలు ఎంతో ప్రత్యేకంగా జరుపుకునే సంక్రాంతి పండగ ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేసారు. భోగి పండగ భోగ భాగ్యాలు కలిగించాలని అందరి ఇళ్లలో సంక్రాంతి శోభ సంతరించాలని మూడు రోజుల పండగ సందడితో ప్రతి ఒక్కరూ ఆనందంగా గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

బిల్లులు క్లియర్ చేశాం..

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

విజయనగరం రూరల్: గడిచిన ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,750కోట్లను విడుదల చేసి అన్ని రంగాల కుటుంబాల్లో సంక్రాంతిని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం రూ.6750 కోట్లు పెండింగ్ బిల్లులను విడుదల చేయడం జరిగిందన్నారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇది జగనన్న కాలనీ. పేద, సామాన్య కుటుంబాలకు సైతం సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయనగరం జిల్లా కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలోని గుంకలాం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కాలనీ. కాదు... కాదు... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మరోసారి కొనసాగి ఉంటే ఈపాటికి అదో పట్టణమే అయ్యేదని స్థానికుల అభిప్రాయం. ఎందుకంటే ఇక్కడ 12,216 కుటుంబాలకు సొంత ఇల్లు సమకూర్చేలా 397 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ ఇది. అందులో స్థలాన్ని అక్కచెల్లెమ్మల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి నాటి ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వారికి పట్టాలు అందించిన విషయం తెలిసిందే. గత ఏడాది సంక్రాంతి సమయంలో కూడా భవన నిర్మాణ పనులు జరిగేవి. సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడు నెలల్లో చిత్రం మారిపోయింది. నిర్మాణ పనులు నిలిచి పోయాయి. సంక్రాంతి సందడే అక్కడ కనిపించలేదు.



నాడు సంతోషం..
నేడు నైరాశ్యం

● పల్లెల్లో కానరాని 'సంక్రాంతి' సంబరం ● మళ్లీ అప్పుల్లోకి వెళ్తున్న గ్రామీణ జీవనం
● గ్రామాల గుండెచప్పుళ్లకు 'గుంకలాం' సాక్ష్యం ● 'సాక్షి' క్షేత్ర పరిశీలనలో వెలుగులోకి పలు అంశాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కూటమి ప్రభుత్వంలో ప్రచారానికి, క్షేత్ర స్థాయిలో వాస్తవానికి 'గుంకలాం' గ్రామీణ చిత్రం అద్దం పడుతోంది. అభివృద్ధి పనులు మూలకు చేరాయి. ఇక సంక్షేమ పథకాలు అమలు నేతిబీరలో నేతి చందమే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'నవరత్నాల' కన్నా మిన్నగా 'సూపర్ 6' పథకాలు అమలు చేస్తామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు చేతులెత్తేస్తుండటంతో గ్రామీణ ఆర్థిక ముఖచిత్రం మారిపోయింది. అది ఈ సంక్రాంతి పండగ నాటికి సుస్పష్టంగా కనిపిస్తోంది. విజయనగరం రూరల్ మండలంలోని గుంకలాం గ్రామంలో 'సాక్షి ప్రతినిధి' ఆదివారం క్షేత్ర పర్యటనకు వెళ్లినప్పుడు సందడి లేని సంక్రాంతి వాతావరణం కనిపించింది. చేతిలో చిల్లగవ్వ లేక అప్పులు చేసి పండగకు పప్పుకూడు తినాల్సిన పరిస్థితి వచ్చిందని గుంకలాం వాసులు తమ ఆవేదన వెళ్లగక్కారు.



ఆవేదనలో అర్థం ఉంది

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక షెడ్యూల్ ప్రకారం సంక్షేమ పథకాల అమలు జరిగింది. లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసే డీబీటీ పథకాలతో ప్రతి నెలా ఎంతోకొంత సొమ్ము చేతికొచ్చేది. ఇతర అభివృద్ధి పథకాల (నాన్ డీబీటీ)తో పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలిగేవి. ఆస్తి సమకూరేది. ఇలా సంక్రాంతి వచ్చేసరికి ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లోనే లబ్ధి ఒనగూరడటంతో అసలైన పండగ వాతావరణం కనిపించేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అలాంటి పథకాలేవీ అమలుకాలేదు. దీంతో ఏడాదిలోనే స్పష్టమైన తేడా గ్రామీణ ప్రాంతాల్లోనే కనిపిస్తోంది. ఒక్క గుంకలాం గ్రామంలోనే డీబీటీ, నాన్ డీబీటీ పథకాలతో 3,991 మందికి రూ.11.71 కోట్ల మేర మేలు జరిగింది. ముఖ్యంగా జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ రైతుభరోసా పథకాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఆర్థిక భరోసా ఇచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.



ఇది విజయనగరం జిల్లా కేంద్రం నుంచి గుంకలాం గ్రామానికి ఉన్న బీటీ రహదారి. సంక్రాంతి నాటికల్లా పల్లెలకు వెళ్లే రోడ్లన్నీ గుంతల్లేకుండా బాగు చేస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఇప్పుడేమో పల్లె రోడ్లన్నీ చక్కగా తయారైపోయాయని చెబుతున్నారు. వారి మాటల్లో డొల్లతనం, పనుల్లో వాస్తవం ఏమిటో ఈ గుంకలాం రోడ్డు అద్దం పడుతోంది. ఎక్కడికక్కడ పిక్క, రాయిపిక్క బూడిద వేసి వదిలేశారు. కొన్నిచోట్ల ఆ పని కూడా సరిగా చేయలేదు. ప్రతిరోజూ ఆ రోడ్డుపై ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు చేయాల్సి వస్తోందని గుంకలాం గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

సంక్రాంతి సందడి లేదు



ఇంట్లో పెళ్లి జరిగితే ఎలాంటి సందడి ఉంటుందో గత ప్రభుత్వంలో అలా ఉండేది. పెళ్లి తర్వాత ఆడబిడ్డను అత్తారింటికి పంపిన తర్వాత అప్పులు లెక్కేసుకునేటప్పుడు ఎలాంటి నిశబ్దం నెలకొంటుందో ఇప్పుడీ కూటమి ప్రభుత్వంలో అలా ఉంది. గత ఏడాదికి ఇప్పటికీ సంక్రాంతి పండగ ఎంతో తేడా కనిపిస్తోంది. రానున్న ఐదేళ్లూ ఇంకా కష్టాలు ఉంటాయేమో! - బలగం ఆదిలక్ష్మి

గుంకలాం ప్రజలకు గత ప్రభుత్వంలో చేకూరిన లబ్ధి

పథకాలు	లబ్ధిదారుల సంఖ్య	అందిన లబ్ధి
ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)	1642	రూ.4,30,50,000
పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)	2349	రూ.7,40,67,067
మొత్తం	3991	రూ.11,71,17,062



మద్యానికి బానిసలయ్యారు..



ఒకప్పుడు సంక్రాంతి పండగ అంటే చిన్నా పెద్దా అంతా కలిసేవారు. ప్రతి ఇంటిలో సందడి ఉండేది. ఇప్పుడు ఎవరి దారి వారిదే. ఏదో పండగకు కలుస్తారంటే ఇప్పుడా నమ్మకం కూడా ఉండట్లేదు. చిన్నా పెద్దా మద్యానికి బానిసలయ్యారు. మందు ఎక్కడ పడితే అక్కడే దొరుకుతోంది. ఇంకేమి పండగ!

– సోంపల్లి నారాయణప్పుడు

ఇప్పుడు అప్పులతో పండగ



నాకు పొలం ఉంది. గత ఐదేళ్లూ వైఎస్సార్ రైతుభరోసా మూడు దఫాలుగా వచ్చేది. పొలం పనులకు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. ధాన్యం అమ్మితే డబ్బులు వెంటనే వచ్చేవి. దీంతో సంక్రాంతి పండగ వస్తుందంటే ఖర్చుల కోసం ఎక్కడా అప్పు కోసం వెళ్లాల్సి ఉండేది కాదు. ఈసారి మాత్రం ప్రధానమంత్రి మోదీ వేసినవే రూ.2వేలు వచ్చాయి. రైతుభరోసా డబ్బులు లేవు. బట్టలు, పిండి వంటల సామాన్లకు అప్పులు చేసి పండగ చేసుకోవాల్సి వచ్చింది.

– కోండ్రు అప్పలనారాయణమ్మ

కనీసం మూడు పథకాలైనా వచ్చేవి..



మా ఊరిలో దాదాపు 2 వేల కుటుంబాలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ కనీసం మూడు పథకాలైనా వచ్చేవి. అమ్మ ఒడి, రైతుభరోసా, చేయూత, ఆసరా... ఇలా ఏదో ఒకటి వచ్చేవి. ప్రతి ఒక్కరి చేతిలో డబ్బులు ఉండేవి. పండగ వస్తుందంటే డబ్బుల కోసం చూసుకోవాల్సిన పని ఉండేది కాదు. మాకు వైఎస్సార్ రైతుభరోసా రాకపోవడంతో పొలం పనులకు అప్పులు చేశాం. దీంతో ధాన్యం దళారులకే అమ్ముకోవాల్సి వచ్చింది. తూకంలో క్వింటాకు 5 కేజీలు చొప్పున ఎక్కువగా తూసుకున్నారు. కనీస మద్దతు ధర కన్నా రూ.200 తక్కువగా ఇచ్చారు.

– బలగం సీతంనాయుడు

నవరత్నాలతో సంక్రాంతి వెలుగులు ఉండేవి..



మా గ్రామంలో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారానే ఏటా 460 మంది వరకూ లబ్ధి కలిగేది. నాలుగేళ్లలో రూ.2.58 కోట్ల వరకూ అందింది. విద్యాదీవెన, వసతి దీవెనతో వంద మంది విద్యార్థుల వరకూ లబ్ధి పొందేవారు. చేదోడు, కాపునేస్తం, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం... ఇలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకం పక్కాగా అందేది. సంక్రాంతి పండగ నాటికి ప్రతి ఒక్కరి చేతిలో ఎంతోకొంత నగదు ఉండేది. డ్రా చేసి తెచ్చుకోవడానికి మా ఊరిలో బ్యాంకు ఖాళీ ఉండేది కాదు. ఇప్పుడు అక్కడికి వెళ్లేవారే లేరు.

– కునుకు వెంకటరావు (నాగరాజు), గుంకలాం గ్రామ సర్పంచ్

అందరికీ కాదు..
కొందరికేనా..!



అతని పేరు రవి. విజయనగరం పట్టణంలోని వీటీ అగ్రహారంలో ఉంటున్నాడు. కూటమి ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ ఇస్తుందంటే కుటుంబ ఆర్థిక భారం తగ్గుతుందని సంబరపడ్డాడు. పథకం అమలు తరువాత రెండుసార్లు గ్యాస్ సిలిండర్ విడిపించారు. ఒక్క దానికి కూడా నగదు జమ కాలేదు. మొదటి సిలిండర్‌కు నగదు జమ కాలేదని జిల్లా పౌర సరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీ, బ్యాంకుల చుట్టూ తిరిగారు. ఈకైవేసీ చేయించమంటే చేయించారు. అయినా నగదు జమ కాలేదు. ఇలాంటి లబ్ధిదారులు జిల్లాలో వేలల్లో ఉన్నారు.

- ● ఉచిత గ్యాస్ ఉత్తిదేనా...!
- ● ఆరు నిబంధనలతో అనర్హత వేటు
- ● ఈకైవేసీ సాకుతో నగదు జమ కాని వైనం
- ● నీరుగారుతున్న పథకం
- ● రెండు నెలలుగా ఆరు వేల మంది ఎదురు చూపులు
- ● బ్యాంకులు, అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

విజయనగరం అర్బన్:

'ఆడపడుచుల కష్టం తీర్చుతా.. మీకు తెల్లకార్డు ఉంటే చాలు.. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.. నా మాట నమ్మండి..' ఇదీ గడిచిన ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత గ్యాస్‌కు సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ అమలు పేరుతో గ్యాస్ తుస్సుమనిపించారు. అన్ని అర్హతలుండీ సిలిండర్లు పొందిన వారిలోనూ వేలాది మందికి ఎగనామం పెట్టారు. మహిళలకు ఉచిత గ్యాస్ పేరిట మరోసారి పొగ పెట్టారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం మాట మూన్నాళ్ల ముచ్చటగా మారింది. డబ్బులిచ్చి గ్యాస్ కొంటే నగదు రాసంటోంది. ఉచిత గ్యాస్ డబ్బులు కోసం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రెండు నెలలుగా లబ్ధిదారులు నగదు కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై మహిళలు మండిపడుతున్నారు. సూపర్ సిక్స్ ప్రామాణికంగా కూటమిలో టీడీపీ ఇచ్చిన హామీ ఉచిత గ్యాస్ పథకం. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తరువాత ఉచిత గ్యాస్ పథకాన్ని హడావుడిగా తెరపైకి తీసుకొచ్చింది. ఉచితం అంటూ లబ్ధిదారులపై



నగదు జమ కాని విషయమై జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ప్రశ్నిస్తున్న లబ్ధిదారులు

టోల్ ఫ్రీ కూడా డమ్మీ

సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1967కి తెలియజేయొచ్చని విస్తృత ప్రచా రం చేసారు. అయితే ఈ నంబరు డమ్మీలాగ ఉంది. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ప్రయోజనం ఉండడం లేదు. ఈ కారణంగా గ్యాస్ ఏజెన్సీ వద్ద లబ్ధిదారు లు క్యూ కడుతున్నారు. వారు కూడా ఏ రకమైన సమాధానం ఇవ్వడం లేదు. దీంతో ఉచిత గ్యాస్ పథకం అందరికీ కాదని.. కొందరికేనా... అని ప్రజలు విమర్శిస్తున్నారు.

తొలుత భారం వేసి ఆ తరువాత నగదు బ్యాంకు ఖాతాకు జమ వేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని గట్టిగా హామీ ఇచ్చింది. అయితే ఈ గ్యాస్ ఉత్తి గ్యాస్ అని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి రోజున ప్రకటించిన ఈ ఉచిత గ్యాస్ బండ పేలని టపాసులా మిగిలింది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న 6 వేల మంది

జిల్లాలో 5.5 లక్షల మంది తెల్లకార్డుదారులు ఉన్నారు. వీటిలో దాదాపు 3 లక్షల మంది వరకు మూడు గ్యాస్ ఏజెన్సీల నుంచి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పథకం అమలు చేసిన తరువాత సిలిండర్ కోసం బుకింగ్ చేసిన 3 లక్షల 60 వేల 461 మహిళామణులలో 6 వేల మందికి ఇప్పటికీ డబ్బులు అకౌంట్‌లో జమ కాలేదు. నిర్ణీత సమయంలోపు వంట గ్యాస్ నగదు ఖాతాల్లో జమ కాకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఈ గ్యాస్ నగదు వివరాల కోసం ఎవరిని అడిగి తెలుసుకోవాలో తెలియక తికమకపడుతున్నారు. సచివాలయాలకు వెళ్తే ఈ విషయం తమకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు.

ఈకేవైసీ సాకు..

ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం డబ్బులు బ్యాంకుల్లో పడకపోవడంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అధికారులు వారికి సమాధానం చెప్పలేక కసురుకుంటున్నారు. తమకు సంబంధం లేదని చెబుతున్నారు. దీంతో ఏజెన్సీల వద్దకు వెళ్తే ఈకేవైసీ చేయించారా..? లేదా చూసుకోండనే సమాధానం వినిపిస్తోంది. ఈకేవైసీ చేయించిన వారికి కూడా రాయితీ డబ్బులు పడడం లేదని చెబుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అయితే ఇదంతా వలంటీరుల చూసుకునే వారు. ఎలాంటి సమస్య వచ్చినా వారి దృష్టికి తీసుకెళితే చాలు చిటికెలో పనిచేసి పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చలి.. చలి...



ఉదయం 7గంటల సమయంలో కురుస్తున్న మంచు

- ● పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ● గిరిజన ప్రాంతాల్లో గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- ● ఉదయం ఆరేడు గంటల వరకు పొగ మంచు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో చలికి తట్టుకోలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మైదాన ప్రాంతాల కంటే గిరిజన ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో అక్కడ ప్రజలు ఉదయం 10 గంటల వరకు బయటకు రాలేని పరిస్థితి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలి మంటలు వేసుకుంటున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండడంతో జనం చలితో అల్లాడిపోతున్నారు. ఉదయం 9గంటల వరకు జనం బయటకు రాలేని పరిస్థితి. చలి తీవ్రతకు చల్లటి గాలులు తోడవ్వడంతో జనం విలవిలలాడిపోతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పుట్‌పాత్, పూరి గుడెసల్లో నివసించేవారు అవస్థలు పడుతున్నారు. ఎముకల కొరికే చలి ఉండడంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చలి కారణంగా అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మైదాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 14 డిగ్రీలు ఉంటే గిరిజన ప్రాంతాల్లో 9 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయింది. ఉదయానే దట్టమైన పొగ మంచు కురవడంతో జనం బయటకు రాలేని పరిస్థితి. ముఖ్యంగా పేపర్ బాయ్‌లు, రైతులు మంచు కారణంగా బయటకు రాలేకపోతున్నారు.



చలికి మంట కాగుతున్న రైతులు

సాయంత్రం 5గంటలకే పెరుగుతున్న చలి

ఉదయం 9 గంటల వరకు ఉంటున్న చలి సాయంత్రం 5 గంటలకే మళ్లీ ప్రారంభం అవుతుంది. దీంతో వివిధ పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. బైక్‌లపై వెళ్లే వారు చలిలో డ్రైవింగ్ చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. స్వెట్టర్లు, మంకీప్లెయర్, గ్లౌజులు వంటివి ధరించినా చలికి రక్షణ ఇవ్వలేక పోతున్నాయి. చలికి చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, చర్మ సంబంధిత వ్యాధిగ్రస్తులు అవస్థలు పడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళ మంచులో తిరగరాదు. మంచు తగ్గిన తర్వాత బయటకు వెళ్లాలి. అత్యవసరమనుకుంటే ఉన్ని దుస్తులు ధరించి బయటకు వెళ్లాలి. గొంతు సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పిల్లలు, వృద్ధులు చలిలో తిరగరాదు. నిమోనియా, సీఓపీడీ వంటి శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, పలమనాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



2024, 2025 సంవత్సరాల్లో జనవరి 8 నుంచి 12 వ తేదీ వరకు నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు డిగ్రీలలో...

2024

తేదీ	కనిష్టం	గరిష్టం
08	24	19
09	24	18
10	23	17
11	24	19
12	23	18

2025

తేదీ	గరిష్టం	కనిష్టం
08	23	17
09	22	15
10	21	14
11	22	15
12	21	14

క్లుప్తంగా

బైక్‌ను లారీ ఢీ కొట్టి ఒకరికి గాయాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై పణుకుపేట-కాశీపేట గ్రామాల మధ్య ఆదివారం మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన పల్లిగుల్ల సీతారాం స్వగ్రామం నుంచి సీతానగరం వస్తున్నాడు. అదేసమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న లారీ మోటార్ సైకిల్‌లో వెళ్తున్న సీతారాంను పణుకుపేట జంక్షన్ సమీపంలో ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం వచ్చి చికిత్స నిమిత్తం బొబ్బిలి కమ్యూనిటీ ఆస్పత్రికి సీతారాంను తరలించింది. బాధితుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

గంట్యాడ: మండలంలోని కొర్లాం జంక్షన్ దగ్గర ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. మండలంలోని అద్దతీగ గ్రామానికి చెందిన లేగల అప్పారావు, అతని భార్య లక్ష్మి శనివారం విజయనగరం వెళ్లి బైక్ పై విజయనగరం నుంచి రాత్రి 9 గంటల సమయంలో తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అప్పారావుకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

పాలకొండ: మండలంలోని జి.వెంకటాపురంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై ప్రయోగమూర్తి పోలీసు సిబ్బందితో ఆదివారం దాడులు చేశారు. పోలీసులు వస్తున్నట్లు సమాచారం తెలియడంతో చాలా మంది పరారవగా 8 మంది పట్టుబడినట్లు ఎస్సై చెప్పారు. పట్టుబడిన వారి దగ్గర నుంచి రూ. 1,06,930లను,ఆరు మొబైల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జి.వెంకటాపురంలో..

పాలకొండ రూరల్: మండలంలోని జి.వెంకటాపురం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 8 మంది జూదరుల నుంచి రూ.1,06,950 నగదుతో పాటు 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.ప్రయోగమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


దేముడమ్మ మృతదేహం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గ్రామానికి చెందిన మిరియాల దేముడమ్మ(69) అనే మహిళ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి చెప్పారు. దేముడమ్మ ఈనెల 6వ తేదీన ఉదయం చలికి కుంపటి కాగుతుండగా చీరను నిప్పంటుకుని గాయాల పాలైంది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న దేముడమ్మ మృతి చెందినట్లు ఆమె కుమార్తె గుమ్మాల వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై దేవి చెప్పారు.

కూలిన రైవాడ కల్వర్టు


వేపాడ: బల్లంకి - ఆనందపురం రహదారిలో కూలిన కల్వర్టు

వేపాడ: మండలంలోని బల్లంకి నుంచి ఆనందపురం వెళ్లే రహదారిలో రైవాడ కాలువపై దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు ఆదివారం కూలిపోయింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కల్వర్టు పైనుంచి ఓ ట్రాక్టర్ వెళ్లగానే అది కూలిపోయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు, ప్రయాణికులు పత్రికాముఖంగా పలుమార్లు తెలియజేసినప్పటికీ సంబంధిత జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కల్వర్టు కూలిపోవడంతో బానాది, బల్లంకి, ఆనందపురం రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దీంతో ఆయా గ్రామస్తులు వేపాడ మీదుగా ఆనందపురం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం అందడంతో పంచాయతీ కార్యదర్శి మూర్తి, వల్లంపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ నెల 26,27,28 తేదీల్లో బల్లంకి గ్రామదేవత తీర్థమహోత్సవానికి లక్షలాదిమంది భక్తులు హాజరవుతాయని అప్పటిలోగా కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹124	₹218	₹228

సంక్రాంతి సందడిలేని పల్లెలు

- కానరాని గంగిరెద్దులు, హరిదాసుల సందడి

పార్వతీపురం: రంగురంగుల హరివిల్లులతో తీర్చిదిద్దిన లోగిళ్లు, పసుపు కుంకుములతో వేసిన గొబ్బెమ్మలు, భోగిమంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పిండివంటల ఘుమఘుమలు ఎటు చూసినా కొత్త అల్లుళ్లు, సంక్రాంతి వచ్చిందంటేనే పల్లెల్లో ఆ సందడే వేరు. నేడు పాశ్చాత్య ధోరణి వెంట పాకులాడుతున్న మన సంస్కృతి , సంప్రదాయాలను యువత మరిచిపోతోంది. నేటి తరం గంగిరెద్దులు, హరిదాసులు అంటే ఏంటి? అని అడిగే పరిస్థితికి మనం వచ్చామంటే మన పరిస్థితి ఎలా ఉందో గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంక్రాంతి వచ్చిందంటే చాలు పల్లెల్లో 10రోజుల ముందునుంచే గంగిరెద్దుల నాట్యాలు, హరిదాసుల సంకీర్తనలు, ఇళ్ల ముంగిట రంగవల్లులు, వాటి మధ్య గొబ్బెమ్మలు వెరసి ప్రతి ఇంటి ముందు సంబరం వెల్లివిరిసేది. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాలకు వచ్చి అందరూ ఒక చోటకు చేరి ఆనందంగా గడిపేవారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో హడావిడి జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు ఆదరణ కోల్పోతున్నాయి.

కానరాని సంబరాలు..

సంక్రాంతి సమీపిస్తున్నప్పటికీ పల్లెల్లో గంగిరెద్దులు కనిపించడం లేదు. హరిదాసుల కీర్తనలు వినిపించడం లేదు. ప్రస్తుత కాలంలో వారికి ఆదరణ లేకపోవడం ఒక కారణమైతే, ఆయా జాతుల వారు కుల వృత్తులను మానుకోవడం మరో కారణంగా చెప్పవచ్చు. ఈ కారణంగా సంక్రాంతి సందర్భంగా పల్లెల్లో కన్పించాల్సిన సంతోషాలు, బంధువుల మధ్య ఆప్యాయతలు కూడా దూరమవుతున్నాయి. ప్రస్తుతం అందరూ సెల్‌ఫోన్లలో కబుర్లు, ఇంటర్‌నెట్, వాట్సాప్, చాటింగ్‌లకే పరిమితమవుతున్నారు. సంక్రాంతి మూడు రోజులు మాత్రం నామమాత్రంగా వేడుకలను చేసుకుని మమ అనిపించేస్తున్నారు. మొదటి రోజు భోగి మంటలు వేసి నవధాన్యాలు, రేగుపండ్లుతో స్నానం చేస్తారు. నువ్వులు, పెసలు కలిపిన పులగన్నం చేసుకుని తింటారు. సంక్రాంతి నాడు దేవుడికి నైవేద్యం పెట్టి పితృదేవతలకు స్వయంపాకాలు, కొత్తబట్టలు చూపించి మొక్కులు చెల్లిస్తారు. కనుమరోజున పశువులను అందంగా అలంకరించి పూజలు చేస్తారు.


సంగంవలసలో హరిదాసుల కీర్తనలు


ములగలో ఇంటిముందు గంగిరెద్దుల సందడి

కనుమరుగవుతున్న హడావిడి

రెండు దశాబ్దాల క్రితం వరకు సంక్రాంతి వచ్చిందంటే పదిరోజుల ముందునుంచే గ్రామాల్లో బంధుమిత్రులతో హడావిడిగా ఉండేది. ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి అలంకరించేవారు. గంగిరెద్దు వాళ్ల పొగడ్తలు, హరిదాసుల కీర్తనలతో గ్రామమంతా సందడిగా ఉండేది. సంక్రాంతి పండగ అంటే పిండివంటలు, మాంసాహారాలు, కొత్త దుస్తులు వేసుకోవడం తదితరాలు చేసేవారు. కానీ ప్రస్తుతం ఈ సందడి కొన్ని గ్రామాలకే పరిమితమవుతోంది. ఇవన్నీ ఇంటర్ నెట్‌లలో చూసి ఆనందం పడాల్సి వస్తోంది.

తిరుమల పవిత్రతను దెబ్బ తీస్తున్నారు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్న తిరుమల తిరుపతి పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తుండడం చాలా బాధాకరమని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి తిరుమల పవిత్రతను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లడ్డూలో కల్తీ నెయ్యి వాడారంటూ ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు అసత్య ఆరోపణల ద్వారా నానారాద్ధాంతంచేశారని దుయ్యబట్టారు. ఇటీవల వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల విషయంలో సరైన ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం వల్ల అమాయక భక్తులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి నెలకొందని వాపోయారు. దీనిపై ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదన్నారు. కాగా వారి అజాగ్రత్త, అశ్రద్ధ కారణంగా ఈ సంఘటన జరిగితే దానిని అంగీకరించేలేక ఆ నిందలను జగన్‌మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలపై నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో తిరుమలలో చేపట్టే కార్యక్రమాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయించడం వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

ఐఏఎస్ అధికారికి కలెక్టర్ పరామర్శ


ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను పరామర్శిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

శృంగవరపుకోట: తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ అధికారి లోతేటి శివశంకర్‌ను కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ ఆదివారం పరామర్శించారు. శివశంకర్ తండ్రి సన్యాసప్పడు ఎస్.కోట మండలంలో ధర్మవరం గ్రామంలో మరణించిన నేపథ్యంలో కలెక్టర్ అంబేడ్కర్ ధర్మవరం వచ్చి ఐఏఎస్ శివశంకర్ ఇంటికి వెళ్లి వారి తండ్రి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. గతంలో లోతేటి శివశంకర్ ఆంధ్రరాష్ట్రంలో పల్నాడు, కడప జిల్లాల కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈఓగా పనిచేస్తున్నారు.

మైత్రి మీడియా ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

విజయనగరం టౌన్: మైత్రి మీడియా ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రంగవల్లుల పోటీలకు మహిళల నుంచి విశేషస్పందన లభించిందని మైత్రి మీడియా యాజమాన్య ప్రతినిధులు మజ్జి సిరిసహస్ర, అవనాపు విక్రమ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పేందుకు వాటిని భావితరాలు కొనసాగించే దిశగా ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా సంక్రాంతి సంబరాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన యూట్యూబ్ చానల్ ద్వారా విశేష ఖ్యాతి గడించిన బ్యాంకాక్ పిల్ల సామంతపూడి శ్రావణి మాట్లాడుతూ మైత్రి మీడియా, జీ తెలుగు సంయుక్త ఆధ్వర్యంలో రంగుల రంగవల్లు పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాయిదుర్గాప్రసాద్ వయోలిన్ కచేరీ, ఆదెయ్య మాస్టారు కామెడీ ప్రదర్శనలు, ఘంటసాల స్మారక కళాపీఠం ప్రతినిధి ఎం.భీష్మారావు శిష్యబృందం సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో రంగవల్లుల పోటీల్లో ప్రథమ విజేత తెలంగాణలోని ఖమ్మం జిల్లా వాసి ఎం.సత్యవేణికి బంగారు నెక్లెస్, ద్వితీయ బహుమతిగా విజయనగరానికి చెందిన జి.లక్ష్మికి బంగారు చెవిదిద్దులు, మూడోబహుమతి పొందిన దివ్యకు వెండిగిన్నె, 12 మందికి కన్సొలేషన్ బహుమతులు, న్యాయనిర్ణేతలకు, కళాకారులకు సత్కారాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాకర్లపూడి సీతాదేవి, జీ తెలుగు సినిమాల ప్రతినిధి అర్జున్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


రంగవల్లులను పరిశీలిస్తున్న మజ్జి సిరిసహస్ర, అవనాపు విక్రమ్, బ్యాంకాక్ పిల్ల సామంతపూడి శ్రావణిలు

మిలటరీ ఉద్యోగాలకు పుట్టినిల్లు ముగడ


కోటస్వామి నాయుడు (లెఫ్టినెంట్ కల్నల్)(ఫైల్)

బాడంగి: మండలంలోని ముగడ గ్రామం మిలటరీ ఉద్యోగులకు పుట్టినిల్లుగా చెప్పుకోవచ్చు. ఈ గ్రామం నుంచి సుమారు మూడు దశాబ్దాల క్రితం నుంచి యువకులు మిలటరీ బాట పట్టారు. మొదట బాడంగికి చెందిన స్వర్గీయ కోటస్వామి నాయుడు అప్పట్లో మిలటరీలో చేరి గ్రామంలోని యువతకు ఆదర్శంగా నిలిచి మిలటరీవైపు దృష్టి మళ్లేలా చేశారు. ఆయన లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్నసమయంలో గ్రామానికి చెందిన పదోతరగతి చదివి ఖాళీగా ఉన్న వారిని మిలటరీలో. ఉద్యోగాలకు అవకాశాలు కల్పించి సుమారు 50మందివరకు ఆ దారిలో పయనించే విధంగా స్ఫూర్తి కలిగించారు. గ్రామంలో ఆయన బావ, టీచర్ యామల స్వామి నాయుడు ప్రోత్సాహంతో గ్రామస్తులు తమ పిల్లలను మిలటరీ వైపు పంపించేందుకు సుముఖత చూపడంతో ఆగ్రామం మిలటరీ గ్రామంగా పేరు తెచ్చుకుంది. చుట్టుపక్కల వారికి కాస్తంత ధైర్యాన్ని నింపింది. అదే గ్రామానికిచెందిన రిటైరైన చప్పసూర్యనారాయణ మిలటరీలో వైద్యుడిగా కొనసాగి గ్రామస్తులకు స్ఫూర్తిగా నిలిచారు. గ్రామంలో స్వచ్ఛంద గ్రంథాలయాన్ని స్థాపించి గ్రామంలోని నిరుద్యోగ యువత, పెద్దలకు విజ్ఞానాన్ని పంచిపెడుతున్నారు. పండగలకు గ్రామానికి వచ్చినప్పుడు ఉచిత వైద్యశిబిరాల ద్వారా గ్రామానికి చెందిన రోగులకు ఉచిత వైద్యం అందించి మంచిపేరు తెచ్చుకున్నారు. అదేవిధంగా సైనికపాఠశాలలో చదివి వైమానికాదళంలో చేరిన మత్సమురళీ ధరరావుతో పాటు మరికొందరు గ్రామానికి సేవలందించారు. మొత్తంపై ఆ గ్రామంలో 50 మందికి పైగా మిలటరీ ఉద్యోగాలు చేసి పదవీవిరమణ చేసినవారు కొందరు కాగా ఇప్పటికీ పనిచేస్తున్న వారు మరికొంతమంది ఉన్నారు.


ముగడ గ్రామం

సైనికులకు వైద్యసేవచేయడం అదృష్టం



ఒక పల్లెటూరిలో పుట్టి మిలటరీలో కల్నల్‌గా డాక్టర్ ఉద్యోగం సాధించి సైనికులకు వైద్యసేవలుచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. స్వగ్రామంలో గ్రంథాలయాన్ని కూడా స్థాపించి నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తున్నందుకు సంతోషంగాఉంది.

చప్ప సూర్యనారాయణ,
మిలటరీ డాక్టర్(లెఫ్టినెంట్)ముగడ

ఆర్మీ ఉద్యోగాలకు ప్రోత్సహించాను



స్వగ్రామంలో ఎంతోమంది నిరుద్యోగ యువతను మిలటరీ ఉద్యోగాల వైపు ప్రోత్సహించడం సంతోషంగా ఉంది. ఆకుటుంబాల వారు బాగుపడ్డారు. లేమిస్థితి నుంచి ఆర్థికంగా ఎదిగి గ్రామాభివృద్ధికి సహకారం అందించారు. ఈ అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

యామల స్వామినాయుడు,
రిటైర్డ్ టీచర్, ముగడ

రోడ్డును బ్లాక్‌చేసిన టీడీపీ కార్యకర్త వాహనం

- గంటసేపు ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు
- పోలీసుల ప్రవేశంతో తీరిన ఇబ్బంది


రోడ్డుపై పార్కింగ్ చేసిన టీడీపీ కార్యకర్త బొలెరో వాహనం


ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

రాజాం: రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో టీడీపీ కార్యకర్త అత్యుత్సాహం కారణంగా ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్‌వీఎస్ పిక్చర్ ప్యాలెస్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఓ టీడీపీ కార్యకర్త బొలెరో వాహనాన్ని ఆదివారం రోడ్డుపై పార్కింగ్ చేసి స్నేహితులను కలిసేందుకు వెళ్లిపోయాడు. దీంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోలేక ట్రాఫిక్ చిక్కులు ఏర్పడ్డాయి. వాహన చోదకుడి గురించి పోలీసులు ఆరా తీసి చివరికి విసిగిపోయారు. గంటసేపు అనంతరం సంబంధిత వాహనదారు అక్కడికి వచ్చి బొలెరో వాహనం తీయడంతో సమస్య సద్దుమణిగింది. వాల్మీకి సేవాదళ్ అనే స్టిక్కర్‌తో వాహనంపై టీడీపీ నేతల ఫ్లెక్సీ ఉంది. తాను టీడీపీ నేతను అని వాహనదారు చెప్పడంతో పోలీసులు ఏమీ అనకుండా విడిచిపెట్టేశారు. సుమారు గంటసేపు ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు టీడీపీ కార్యకర్త తీరును దుయ్యబట్టారు. ఈ తంతుతో కిలోమీటర్ మేర పాలకొండ రోడ్డులో వాహనాలు నిలిచిపోగా ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

కోడిపందాలు, పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ వకుల్ జిందల్


వకుల్ జిందల్, ఎస్పీ విజయనగరం

విజయనగరం క్రైమ్: జిల్లాలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడిపందాలు, పేకాట, గుండాటలు, ఇతర రకాలైన జూద క్రీడలను నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని కోరారు. గతంలో పేకాట, కోడిపందాలతో ప్రమేయమున్న 109మంది వ్యక్తులను గుర్తించి, వారిని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. హైకోర్టు ఆదేశాలతో మండల స్థాయిలో రెవెన్యూ, స్థానిక పోలీసులు, జంతు సంరక్షణ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. కోడిపందాలు నిర్వహించే వారిపైనా, కోడి కత్తులను తయారుచేసే వారిపైనా, కోడిపుంజులకు కత్తులు కట్టిన వారిపైనా నిఘా పెట్టామని స్పష్టం చేశారు. కోడిపందాలు నిర్వహించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో డ్రోన్స్‌తో పర్యవేక్షిస్తామని తెలిపారు. పండగలకు స్వంత గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్ఎమ్ఎస్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్‌చేసుకుని, స్థానిక పోలీసులకు సమాచారమిచ్చి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంచవద్దని, సాధ్యమైనంత వరకూ వాటిని తమతో తీసుకువెళ్లడం, లేదా బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు.

మార్కెట్లు కిటకిట


భోగి పళ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


రద్దీగా ప్రధాన రహదారి


ఆర్డర్‌పై తయారు చేసిన పిండివంటలు


రద్దీగా షాపింగ్ మాల్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండగ సందడి కనిపిస్తోంది. మరో రెండు రోజుల్లో పెద్ద పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర, బంగారం, కిరాణా, పిండి వంటల దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పండగ సమీపిస్తున్న కొద్దీ కొనుగోళ్లు మరింత ఊపందుకుంటాయి.

ఆర్డర్‌పై పిండి వంటలు..

సంక్రాంతి పండగ కోసం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ తదతర ప్రాంతాల్లో ఆర్డర్‌పై పిండి వంటల తయారీ ముమ్మరంగా సాగుతోంది. అరిసెలు, మిఠాయిలు, జంతికలు, పూతరేకులు వంటి పిండి వంటలు పెద్ద ఎత్తున ఆర్డర్‌పై తయారు చేస్తున్నారు. ఈ వ్యాపారం కూడా బాగా జరుగుతోంది. ఏడాది మొత్తంలో సంక్రాంతి సీజన్‌లో పిండి వంటల తయారీకి డిమాండ్ బాగుంటుంది.